జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా గొట్టిపాటి రవికుమార్



ఈనాడు డిజిటల్, నరసరావుపేట: పల్నాడు జిల్లాకు ఇన్‌ఛార్జిగా మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో పలు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్న తీరు, అమలును ఆయన పర్యవేక్షించనున్నారు. జిల్లాలో జరిగే అన్ని ప్రభుత్వ సంబంధిత కార్యక్రమాలు, సమీక్షలకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరుకానున్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో మంత్రి గొట్టిపాటికి సత్సంబంధాలే ఉన్నాయి. ముఖ్యంగా చిలకలూరిపేట, నరసరావుపేటతో ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉంది. నరసరావుపేటలో కడియాల వారు వీరికి బంధువులు కావడం గమనార్హం. ప్రస్తుతం రవికుమార్ బాపట్ల జిల్లా అద్దంకి నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తూ విద్యుత్తు శాఖామంత్రిగా ఉన్న విషయం తెలిసిందే.

జడ్పీ రికార్డుల పరిశీలన

గుంటూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర 5వ ఆర్థిక సంఘం సభ్యులు ఆచార్య ఎం.ప్రసాదరావు, ఆచార్య ఎంవీఎస్ పద్మారావు, కె.కృపారావు, తాఖద్దిన్ జిల్లాపరిషత్తు కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. వార్షిక బడ్జెట్, నిధుల వినియోగం, ఇ-గ్రామ స్వరాజ్ పోర్టల్, ఆడిట్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించగా.. సీఈవో జ్యోతిబసు, డిప్యూటీ సీఈవో సీహెచ్.కృష్ణ వివరాలు తెలిపారు. అనంతరం సీఈవో ఛాంబర్‌లో సమావేశం నిర్వహించి జడ్పీ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జడ్పీ విభాగాల ఏవోలు రామకోటయ్య, శోభారాణి, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఐడీకి బెల్లంకొండ ఎస్సై?

బెల్లంకొండ: బెల్లంకొండ ఎస్సై రాజునాయక్ సీఐడీకి బదిలీ కానున్నారు. రెండు నెలల కిందటే రాజునాయక్‌ను తమ విభాగానికి పంపమని సీఐడీ కోరినట్లు తెలుస్తోంది. పలు కేసుల ఛేదనలో ఎస్సై చూపిన చొరవతో సిఫార్సు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రెండురోజుల్లో బెల్లంకొండ నుంచి సీఐడీకి ఆయన బదిలీకానున్నారు. మరోవైపు ఇటీవల చంద్రాజుపాలెంలో డీజే విషయంలో తలెత్తిన వివాదాన్ని ఆపేందుకు వెళ్లిన అతనిపై కొందరు విధులకు ఆటంకం కలిగించారని, తోపులాట చోటుచేసుకుందని ఎస్సై రాజునాయక్ ఫిర్యాదు మేరకు అయిదుగురిపై మంగళవారం కేసు నమోదు చేశారు.

సరికొత్తగా మధ్యాహ్న భోజనం

మెనూ మార్పుపై అభిప్రాయాల సేకరణ

న్యూస్‌టుడే, నరసరావుపేట వ్యవసాయం



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన మెనూ అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మెనూలో ఇకపై మార్పులు చేయనున్నారు. వంటకాల జాబితాలో కొత్తరకాలు రానున్నట్లు తెలుస్తోంది. గత వైకాపా ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అస్తవ్యస్తం చేసింది. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో మెనూ సక్రమంగా అమలు కాలేదు. నిర్వాహకులు పెట్టిందే విద్యార్థులు తినాల్సిన పరిస్థితి. మెనూ సరిగా లేదని, మార్పులు చేయాలని విద్యార్థులు తల్లిదండ్రులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. ఈ క్రమంలోనే చాలా మంది విద్యార్థులు అయిష్టంగానే భోజనాలు చేస్తున్నారు. మరికొందరు ఇంటికెళ్లి తిని వస్తున్నారు.

కూటమి ప్రభుత్వం విద్యార్థులకు నచ్చేలా మెనూ రూపకల్పనకు చర్యలు చేపట్టింది. జిల్లా స్థాయిలో చర్చించి మెనూలో మార్పులకు శ్రీకారం చుట్టింది. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అధికారులు, విద్యార్థులు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, పథకం నిర్వాహకులు, యాజమాన్య కమిటీ సభ్యులతో మాట్లాడి అభిప్రాయాలు సేకరించారు. జిల్లా విద్యాశాఖాధికారి కొత్త మెనూపై రూపొందించిన నివేదికను కలెక్టర్‌కు అందించారు. అన్నం, సాంబారు, గుడ్డుతో కూర, స్వీటు, జీరా రైస్‌తో పాటు పలు రకాలు అభిప్రాయాల్లో వ్యక్తమైనట్లు తెలుస్తోంది. ఈ నివేదికను కలెక్టర్ ప్రభుత్వానికి పంపారు. ఇలా రాష్ట్రస్థాయిలో వచ్చిన అభిప్రాయాలను పరిశీలించి కొత్త మెనూ రూపొందిస్తారు. ఇప్పటికే ఈ ప్రక్రియ తుది దశకు వచ్చినట్లు, దీపావళి నుంచి కొత్త మెనూ అమలు కానున్నట్లు సమాచారం. దీనిపై విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుత మెనూపై విద్యార్థులు చాలామంది పెదవి విరుస్తున్నారు. ఉడికించిన గుడ్డు తినటానికి, పచ్చడి, రాగిజావ తీసుకోవటానికి ఆసక్తి చూపటం లేదు. గుడ్డు బదులు కోడిగుడ్డుకూర, మజ్జిగ, రాగిలడ్డు లేదా బిస్కెట్ ఇస్తే బాగుంటుదని సూచనలు వచ్చాయి. ఇప్పటికే మెనూపై అభిప్రాయాల సేకరించి నివేదికను కలెక్టర్‌కు అందించినట్లు తెలిపారు.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు	1622
మొత్తం విద్యార్థులు:	1,38,778
మధ్యాహ్న భోజనం తినేవారు:	92,000
వంట తయారీ ఏజెన్సీలు:	1622

నేటి నుంచే మద్యం ప్రైవేటు విక్రయాలు

వ్యాపారుల చేతికి లైసెన్సులు

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - నరసరావుపేటటౌన్



ప్రభుత్వ మద్యం దుకాణాలకు మంగళవారంతో తెరపడింది. బుధవారం నుంచి కొత్త మద్యం పాలసీ అమల్లోకి వస్తోంది. ఈ విధానంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు కలిపి 373 ప్రైవేటు దుకాణాలకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ అధికారులు లైసెన్సులు మంజూరు చేశారు. వీటిని మంగళవారమే తీసుకున్న వ్యాపారులు ఆయా ప్రాంతాల్లో దుకాణాల ఏర్పాట్లలో తలమునకలయ్యారు. ఇప్పటివరకు ప్రభుత్వ దుకాణాలు నడిపిన ప్రదేశాల్లోనే ప్రైవేటువి ఏర్పాటు చేసుకోవడానికి సంబంధిత భవనాల యజమానులతో సంప్రదింపులు జరుపుతున్నారు. అవసరమైతే ఎక్కువ అద్దె చెల్లించేందుకూ ముందుకొస్తున్నారు.

డిపోల వద్ద రద్దీ లేకుండా : కొత్త దుకాణాలకు బుధవారం ఉదయం నుంచి డిపోల్లో మద్యం ఇస్తారు. తొలిరోజు కావడంతో ఎక్కువ రద్దీకి అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతో తగిన స్థాయిలో నిల్వలు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని గుంటూరు, తెనాలి, నరసరావుపేట డిపోల అధికారులకు ఎక్సైజ్ ఉన్నతాధికారులు సూచించారు. ఈ మేరకు మంగళవారం వారితో సమావేశమయ్యారు. చలానాలు తీసుకెళ్లిన వారికే డిపోల్లో మద్యం అందిస్తారు. మంగళవారం రాత్రి 9 గంటలతో ప్రభుత్వ దుకాణాలకు తెరపడుతుంది. అప్పటికి ఏమైనా నిల్వలుంటే వాటిని డిపోల్లో అప్పగించాలని అధికారులు ఆదేశించారు.

అభ్యంతరాలున్నచోట...: గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాలను జనావాసాలున్నచోట ఏర్పాటు చేశారని, ఇప్పుడక్కడ కొనసాగించొద్దంటూ మేడికొండూరు, మంగళగిరి ప్రాంతాల నుంచి అధికారులకు విజ్ఞాపనలు అందాయి. ప్రజాప్రతినిధులు సైతం ఈ విషయాన్ని తెలియజేశారని, సంబంధిత సర్కిల్ సీఐలకు చెప్పి ప్రజల అభ్యంతరాలేమిటో తెలుసుకోవాలని చెప్పామని ఎక్సైజ్ ఉన్నతస్థాయి వర్గాలు తెలిపాయి. ప్రజలకు ఇబ్బందిగా ఉంటే అక్కడ దుకాణాల ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నాయి.

వాటాల కోసం సంప్రదింపులు!

మద్యం వ్యాపారంలో అనుభవం ఉన్న చాలామంది సిండికేట్లుగా ఏర్పడి దరఖాస్తులు చేశారు. వీరికి చాలా తక్కువ సంఖ్యలో దుకాణాలు దక్కాయి. కొంతమంది నేతలకూ ఇదే పరిస్థితి ఎదురైంది. ఈ నేపథ్యంలో దుకాణాలు దక్కించుకున్న కొత్తవారితో మంతనాలు జరుపుతున్నారు. కొంత వాటా ఇవ్వాలని, తామే వ్యాపారం చేసిపెడతామని లాబీయింగ్ చేస్తున్నట్లు తెలిసింది. కొన్నిచోట్ల ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని స్థానికుల్ని వ్యాపార భాగస్వాములుగా చేర్చుకుంటే అన్నివిధాలుగా అండగా ఉంటారని సూచిస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, వైద్యులు, ఇతర వృత్తి నిపుణులపై ఈ ఒత్తిడి ఎక్కువగా ఉంది. దుకాణాలు దక్కించుకున్న ఇతర రాష్ట్రాల వారినీ వాటాలు కోరుతున్నారు.

జిల్లాల వారీగా దుకాణాలు

గుంటూరు	పల్నాడు	బాపట్ల	మొత్తం
127	129	117	373

సామగ్రి మాకివ్వండి కొంటాం

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఉన్న ఫ్రిజ్‌లు, స్కానర్లు, ఫేక్ కరెన్సీని గుర్తించే టెస్టర్ యంత్రాలు, కుర్చీలు, బల్లలు, ఫ్యాన్లను కొనుగోలు చేస్తామంటూ కొత్త దుకాణదారులు ముందుకొస్తున్నారు. ఆ సామగ్రిని డిపో లేదా గోదాములో నిల్వ చేయాలన్న ఆదేశాలున్నాయి తప్ప విక్రయించాలని ఉత్తర్వులు రాలేదని అధికారులు చెబుతున్నారు.

నెలాఖరుకల్లా బైపాస్ పనులు పూర్తి

- సోలార్ విద్యుత్తుకు ప్యానెల్ బోర్డుల ఏర్పాటు
- 25 చోట్ల సీసీ కెమెరాలు



బొప్పూడి - తిమ్మాపురం మధ్య నిర్మించిన బైపాస్ రహదారి

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: చిలకలూరిపేట బైపాస్ రహదారి పనులు నెలాఖరుకల్లా పూర్తి చేసి జాతీయ రహదారుల సంస్థకు అప్పగించేందుకు బీఎస్‌సీపీఎల్ సంస్థ సిద్ధమవుతోంది. మిగిలిన చిన్న పనులు వేగంగా పూర్తి చేస్తున్నారు. చిలకలూరిపేట మండలం రామచంద్రాపురం అడ్డరోడ్డు నుంచి యడ్లపాడు మండలం తిమ్మాపురం వరకు 16.384 కి.మీ. దూరం బైపాస్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అయితే నూతనంగా నిర్మించిన ఈ మార్గంలో ఆధునిక సాంకేతికతను వినియోగించనున్నారు. గణపవరం- తిమ్మాపురం మధ్య బైపాస్ రహదారి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఒక మెగావాట్ సోలార్ విద్యుత్తు ఉత్పత్తి కోసం ప్యానల్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సోలార్ ప్యానెళ్ల నుంచి గ్రీన్‌ఎనర్జీ ఒక మెగావాట్ ఉత్పత్తి చేసి గ్రిడ్‌కు అనుసంధానం చేస్తారు. బైపాస్ రహదారిలో అవసరమైన విద్యుత్తును గ్రిడ్ నుంచి ఉపయోగించుకుంటారు. సోలార్ విద్యుత్తు ఎప్పుడైనా తగ్గితే దానికి తగినట్లు విద్యుత్తు బిల్లులు చెల్లిస్తారు. దీంతోపాటు 25 సీసీ కెమెరాలను రహదారిలో ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా ఎక్కడ ప్రమాదం జరిగినా, ఎలాంటి ఇబ్బంది వచ్చినా ఆటోమేటిక్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా వెంటనే సమాచారం బైపాస్ రహదారి కంట్రోల్ రూమ్‌కు వెళ్తోంది. తద్వారా తక్షణమే స్పందించి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. నవంబరులో బైపాస్ ప్రారంభోత్సవం చేసేలా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

నాటకోత్సవాలు నేటి నుంచి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి సమితి, అభినయ థియేటర్ ట్రస్టు, గుంటూరు ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు, యశోద ఫౌండేషన్ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నుంచి గుంటూరులో నారా చంద్రబాబు నాయుడు నాటకోత్సవాలు ప్రారంభమవుతాయని నిర్వాహకుడు అభినయ శ్రీనివాస్ తెలిపారు. గుంటూరు శ్రీవెంకటేశ్వర విజ్ఞానమందిరంలో సాయంత్రం ఆరు గంటలకు పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్య అతిథిగా పాల్గొని ఉత్సవాలను ప్రారంభిస్తారు. నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి సమితి కార్యనిర్వాహణాధికారి ఎ.శ్రీనివాస్, భారతీయ విద్యాభవన్ కార్యదర్శి పీఆర్ రాజు, తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి దామచర్ల శ్రీనివాస రావు తదితర ప్రముఖులు పాల్గొంటారు. సభానంతరం శ్రీకాకుళం జిల్లా శర్వాణీ గ్రామీణ గిరిజన సాంస్కృతిక సంఘం బొరివంక కళాకారులు కొత్త పరిమళం నాటికను, రాత్రి 8 గంటలకు కె.జె.ఆర్. కల్చరల్ అసోసియేషన్ సికింద్రాబాద్ వారు సాహితీ సూక్తం నాటికను ప్రదర్శిస్తారు. ఇదే తీరులో మిగిలిన రెండు రోజులు కూడా సభలు, నాటక ప్రదర్శనలు ఉంటాయని ఒక ప్రకటనలో తెలిపారు.

చిలకలూరిపేటలో రెండోరోజు చెల్లింపులు

- విజయవాడ భారతీనగర్ ఐసీఐసీఐ బ్యాంకులో సీఐడీ విచారణ
- మేనేజర్, డిప్యూటీ మేనేజర్‌ను విచారించిన సీఐడీ



బాధితులకు నగదు పంపిణీ చేస్తున్న జడ్‌ఎం సందీప్ మెహ్రా

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: చిలకలూరిపేటలో సోమవారం నుంచి బాధితులకు తిరిగి నగదు చెల్లింపులు ప్రారంభించిన బ్యాంకు అధికారులు మంగళవారం కూడా కొనసాగించారు. రెండు రోజుల్లో పదిమంది బాధితులకు చెల్లింపులు చేశారు. చిలకలూరిపేట, నరసరావుపేట ఐసీఐసీఐ బ్యాంకుల్లో విచారించిన సీఐడీ అధికారులు మంగళవారం విజయవాడ భారతీనగర్ బ్రాంచిలో విచారణ చేపట్టారు. సీఐడీ అదనపు ఎస్పీ ఆదినారాయణ, సీఐ సంజీవ్‌కుమార్ ఆధ్వర్యంలోని పది మంది బృందం భారతీనగర్ బ్రాంచి మేనేజర్, డిప్యూటీ మేనేజర్లను విచారించింది. ఇక్కడ మొత్తం బాధితులు 11 మందిని గుర్తించారు. వారిలో 9 మందిని విచారించినట్లు సీఐడీ అధికారులు తెలిపారు. మరో వైపు సీఐడీ అధికారులు గత మేనేజర్ నరేష్ సెల్ఫీ వీడియో విడుదల చేసిన నేపథ్యంలో అందులో పేర్కొన్నవారిని కూడా విచారించి మొత్తం వివరాలు రాబట్టేందుకు చర్యలు చేపడుతున్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యం.. ఇదిగో సాక్ష్యం!

గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఈ చిత్రాలే నిదర్శనం. దాచేపల్లి నుంచి భట్రుపాలెం వెళ్లే దారిలో 2020లో నాయుడుపేట లేఔట్ ఏర్పాటు చేశారు. ఇక్కడ 4,265 మందికి పట్టాలు మంజూరు చేశారు. 847 మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. కొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. ఇక్కడ మౌలిక వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారుల నిర్మాణం చేపట్టకపోవడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఇళ్ల చుట్టూ ముళ్లపొదలు అల్లుకున్నాయి. పైప్‌లైన్ పాడైపోయి, బోర్ల నుంచి నీటి సరఫరా లేక ట్యాంకులు అలంకారప్రాయంగా మారాయి. వసతులు కల్పించి తమ అవస్థలు తీర్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.

- ఈనాడు, నరసరావుపేట, న్యూస్‌టుడే, దాచేపల్లి



అలంకారప్రాయంగా ట్యాంకులు



నాయుడుపేట లేఔట్‌లో ఇళ్ల దుస్థితి



అధ్వానంగా రహదారి..

జిల్లాలో 435.8 మి.మీ. వర్షపాతం



రొంపిచర్లలో మిరపపొలంలో నిలిచిన వర్షపునీరు

నరసరావుపేట వ్యవసాయం. న్యూస్‌టుడే : బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో మంగళవారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. ఇప్పటి వరకు పంటలకు పెద్ద నష్టం లేకపోయినా మరో రెండు రోజులు భారీ వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో పంటలు ఎక్కడ ఉరకెత్తిపోతాయో అన్న ఆందోళనలో అన్నదాతలు ఉన్నారు. రొంపిచర్ల మిరప పొలాల్లో అక్కడక్కడ వర్షపు నీరు నిలిచింది. తుపాను ప్రభావంతో జిల్లాలోని 28 మండలాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షం పడింది. జిల్లాలో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు 435.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా మి.మీ.లో ఇలా ఉన్నాయి. అత్యధికంగా ముప్పాళ్లలో 53.0, మాచర్ల 5.8, వెల్దుర్తి 0.6, దుర్గి 5.0, రెంటచింతల 6.0, గురజాల 3.4, దాచేపల్లి 2.2, కారంపూడి 23.4, పిడుగురాళ్ల 5.6, మాచవరం 1.2, బెల్లంకొండ 6.4, అచ్చంపేట 3.0, క్రోసూరు 4.8, అమరావతి 2.6, పెదకూరపాడు 6.0, సత్తెనపల్లి 9.0, రాజుపాలెం 4.8, నకరికల్లు 8.8, బొల్లాపల్లి 17.6, వినుకొండ 35.8, నూజండ్ల 32.2, శావల్యాపురం 28.0, ఈపూరు 35.4, రొంపిచర్ల 19.0, నరసరావుపేట 23.0, నాదెండ్ల 29.4, చిలకలూరిపేట 37.2, యడ్లపాడు 26.6 మి.మీ. వర్షం పడింది.

రైతుబజార్లు ఏవీ!

- జిల్లాలో చిలకలూరిపేట మినహా మరెక్కడా లేవు
- నష్టపోతున్న రైతులు, వినియోగదారులు

రైతులు పండించిన పంటలను స్వయంగా అమ్ముకునేందుకు సరైన వేదికలు లేవు. కూరగాయల ధరలు పెరిగినప్పుడు ప్రభుత్వం రాయితీతో అందించే సరకులు దొరికే స్థలం లేదు. జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో రైతుబజార్లను ఏర్పాటు చేస్తామని గత వైకాపా ప్రభుత్వం హామీ ఇచ్చి అయిదేళ్లు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అయినా ఈ సమస్యకు పరిష్కారం చూపాలని పట్టణాల వాసులు, రైతులు కోరుతున్నారు. నరసరావుపేట, మాచర్ల, వినుకొండ, అమరావతి, పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల వంటి పట్టణాల్లో రైతుబజార్లు ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా డిమాండ్ ఉన్నా ఆ దిశగా చర్యలు లేవు. జిల్లాలో చిలకలూరిపేటలో మాత్రమే రైతుబజారు ఉంది.

ఈనాడు డిజిటల్, నరసరావుపేట



చిలకలూరిపేటలోని రైతుబజార్

జిల్లాలో నరసరావుపేట మండలం, ముప్పాళ్ల మండలం, మాచర్ల, బెల్లంకొండ మండలంలోని పలు ప్రాంతాల్లో ఆకుకూరలు, కూరగాయలు విరివిగా పండిస్తుంటారు. అయితే రైతులు తమ ఉత్పత్తులను నేరుగా విక్రయించుకునే మార్గం లేకపోవడంతో వీరంతా దళారులకు తక్కువ ధరలకు అమ్ముకుంటూ నష్టపోతున్నారు. పంట ఉత్పత్తులను అటు విజయవాడ, ఇటు గుంటూరు తీసుకెళ్లాల్సి వస్తోందని, రవాణా ఛార్జీలు పోనూ నగదు మిగలడం లేదని రైతులు వాపోతున్నారు. అదే స్థానికంగా రైతుబజార్లు ఉంటే వాటిని ఇక్కడే నేరుగా అమ్ముకోవడానికి అవకాశం ఉంటుంది. టమాటా, ఉల్లి ధరలు ఆకాశాన్నంటినప్పుడు ప్రభుత్వం నేరుగా సబ్సిడీ ధరలకు రైతుబజార్లలో అమ్ముతుంది. అయితే జిల్లాలో రైతుబజార్లు లేకపోవడంతో నరసరావుపేట, మాచర్ల, సత్తెనపల్లి, పిడుగురాళ్ల పట్టణ వాసులకు సబ్సిడీ ధరలకు టమాటా, ఉల్లి దొరకడం లేదు. ఈ సమస్య తీరాలన్నా రైతుబజార్లు ఉండాల్సిన ఆవశ్యకత ఉంది.

స్థలం అందుబాటులో ఉన్నా..

జిల్లా కేంద్రం నరసరావుపేటలో రైతుబజారు ఏర్పాటుకు తగు స్థలం కూడా అందుబాటులో ఉంది. అయినా ఇక్కడ రైతుబజారు ఏర్పాటు కలగానే మిగిలింది. పల్నాడు బస్టాండ్ వద్ద అన్నాక్యాంటీన్ పక్కన మార్కెట్ కోసమే షెడ్డులు కూడా ఏర్పాటు చేసి ఉంచారు. ఈ స్థలం ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. దీనిని రైతుబజారుకు కేటాయిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. ట్రాఫిక్ సమస్యా తలెత్తదు. సత్తెనపల్లిలో మార్కెట్‌యార్డు ఆవరణలో కోడెల హయాంలో రైతుబజారు ఏర్పాటు చేసినా.. ప్రస్తుతం ఆదరణ కోల్పోయి కళావిహీనంగా మారింది. రైతుబజారు మాదిరి తక్కువ ధరలకు కూరగాయలు లభించడం లేదు. వినుకొండలో ఎన్నెస్పీ కాలనీలో ఖాళీస్థలం ఉంటే వైకాపా హయాంలో ఏర్పాటు చేస్తున్నామని చెప్పి మాజీమంత్రి విడదల రజిని కొబ్బరికాయ కొట్టారు. అనంతరం ఏళ్లు గడిచినా అడుగుముందుకు పడలేదు. పిడుగురాళ్ల, మాచర్లలో కూడా రైతుబజార్ల ఏర్పాటుకు గత పాలకులు అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేశారు. ప్రస్తుత పాలకులు అయినా ప్రధాన పట్టణాల్లో రైతుబజార్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుని ఆ దిశగా అడుగులు వేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

తెలంగాణకు వెళ్లి అమ్ముకుంటున్నా



నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. అందులో ఆకుకూరలు సాగు చేస్తుంటా. పాలకూర, గోంగూర, మెంతికూర, పుదీనా, కొత్తిమీర, తోటకూర పండిస్తుంటా. అయితే వీటిని గుంటూరు వెళ్లి అమ్ముకోవాలంటే దూరాభారం. ఒక్కోసారి తెలంగాణకు వెళ్లి అమ్ముకుంటున్నా. అదే మాచర్లలో రైతుబజార్ ఏర్పాటు చేస్తే చాలా సౌకర్యం. - ఎస్కే నాగులు, మండాది, వెల్దుర్తి మండలం

రాయితీపై ఎక్కడ అమ్ముతారో తెలియడం లేదు



జిల్లా కేంద్రం నరసరావుపేటలో రైతుబజారు లేకపోవడం వల్ల కూరగాయల ధరలు పెరిగినప్పుడు ఇబ్బందిగా ఉంటోంది. ప్రభుత్వం అందించే టమాటాలు కానీ, ఉల్లిపాయలు కానీ, పప్పులు లాంటి నిత్యావసర వస్తువులు అమ్మేచోటు ఎక్కడో తెలియడం లేదు. జిల్లా కేంద్రానికి రైతుబజారు అత్యవసరం. - దుర్గాపద్మజ, కోట సెంటర్, నరసరావుపేట

దుకాణం తెరిచే ముందు ఎమ్మెల్యేలను కలవండి

లాటరీ గెలుచుకున్న వారికి ఎక్సైజ్ సీఐల హితవు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: దుకాణం పెట్టుకోవాలా? అయితే ఎమ్మెల్యేలను కలవండి అంటూ లాటరీ గెలుచుకున్న వారికి కొందరు ఎక్సైజ్ సీఐలు చెబుతున్నట్లు సమాచారం. జిల్లాలో 129 ప్రైవేటు మద్యం దుకాణాలకు లాటరీ పూర్తయిన సంగతి తెలిసిందే. ఆయా దుకాణాలకు సంబంధించి లైసెన్స్ ఫీజును ఆరోవంతు చలానా రూపంలో మంగళవారం జిల్లాలోని ఎక్సైజ్ కార్యాలయంలో చెల్లించారు. జిల్లా అధికారులు కూడా దుకాణాదారులకు ఇవ్వాల్సిన లైసెన్స్ ఐడీ, యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఇచ్చేశారు. డిపో నుంచి కూడా సరకు తీసుకెళ్లొచ్చని సూచనలు చేశారు. అయితే ముందుగా దుకాణం ప్రారంభించాలంటే స్థానిక ఎమ్మెల్యే నుంచి అనుమతులు తీసుకోవాల్సి వస్తోందని కొందరు మద్యం వ్యాపారులు చెబుతున్నారు. ఒక ఎమ్మెల్యే అయితే ప్రత్యక్షంగా జోక్యం చేసుకోకుండా ఒక కాంట్రాక్టర్‌తో మాట్లాడుకోవాలని చెబుతున్నారు. అతనికి 30 శాతం వాటా ఇస్తే.. హాయిగా దుకాణం తెరచుకోవచ్చని లేకపోతే ఇబ్బందులు తప్పవని బెదిరిస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు వ్యాపారులు తాము మంత్రి లోకేశ్‌ను కలుస్తామని, అక్కడే తమ సమస్యను చెప్పుకొంటామని, స్థానిక ఎమ్మెల్యేలకు తెగేసి చెబుతున్నారు. మరోవైపు లాటరీలో దుకాణాలు గెలుచుకున్న వారందరికీ లైసెన్స్ ఐడీలు ఇచ్చామని, నిరభ్యంతరంగా దుకాణాలు ప్రారంభించుకోవచ్చని ఎక్సైజ్ ఈఎస్ మణికంఠ తెలిపారు. మంగళవారం సాయంత్రం కొందరు డిపో నుంచి సరకు కూడా తీసుకెళ్లారని చెప్పారు.



లైసెన్స్ కోసం జిల్లా కార్యాలయానికి వచ్చిన వ్యాపారులు

ఫుట్‌బాల్ అండర్-14 బాల, బాలికల ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక రేపు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే : ఫుట్‌బాల్ విభాగంలో అండర్- 14 బాల, బాలికల ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక ఈనెల 17న సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎన్.సురేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. వివిధ క్రీడలు నిర్వహించే స్థలాలను, తేదీలను వారు వివరించారు. బ్యాడ్మింటన్ విభాగంలో అండర్- 14, 17 బాలికల ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక నరసరావుపేట కోడెల శివప్రసాదరావు స్టేడియంలో, బ్యాడ్మింటన్ విభాగంలో అండర్- 14, 17 బాలుర ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాలలో 18న నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాఫ్ట్‌బాల్ విభాగంలో అండర్- 14 బాల, బాలికల ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 19న, బాల్ బ్యాడ్మింటన్ విభాగంలో అండర్- 14, 17 బాలుర ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక చిలకలూరిపేట మండలం పసుమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 19న చేపడుతున్నట్లు వివరించారు. ఆసక్తి గలవారు ఆయా విభాగాల తేదీల్లో ఉదయం 9 గంటలకు ధ్రువపత్రాలతో హాజరు కావాలని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి కోరారు.

వర్షం కారణంగా వాయిదా

శావల్యాపురంలో 16న నిర్వహించాల్సిన బాల్ బ్యాడ్మింటన్ విభాగంలో అండర్- 14, 17 బాలికల జట్ల ఎంపిక, ఫుట్‌బాల్ అండర్- 14 బాల, బాలికల జిల్లా జట్ల ఎంపిక వాయిదా వేసినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎన్.సురేష్‌కుమార్ తెలిపారు.

రాళ్లు అడ్డు వేస్తే ప్రవాహం సాగేదెలా?

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో వరుసగా రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో చిలకలూరిపేట ప్రాంతంలో ఓగేరు, కుప్పగంజి వాగుల్లో నీటి ప్రవాహం పెరిగింది. ఓగేరువాగులో మద్దిరాల వద్ద గ్రానైట్ వ్యర్థాలు నీటి ప్రవాహానికి అడ్డుగా ఉండటంతో వెనుక వైపు నీరు పొంగి పంట పొలాలు మునుగుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ఓగేరువాగులో అడ్డుగా గ్రానైట్ వ్యర్థాలు

కలాం జీవితం యువతకు ఆదర్శప్రాయం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితం ఆదర్శప్రాయమని తెదేపా రాష్ట్ర వైద్య విభాగం ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. తెదేపా జిల్లా కార్యాలయంలో మంగళవారం కలాం జయంతి నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కడియాల మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి దేశానికి దిశా నిర్దేశనం చేసే స్థాయికి ఆయన ఎదిగారని, శాస్త్రవేత్తగా పలు ఉప గ్రహాలకు రూపకర్తగానే కాకుండా రాష్ట్రపతిగా ప్రజలకు చేరువయ్యారని పేర్కొన్నారు. నేతలు గొట్టిపాటి జనార్ధన్ బాబు, జగ్గారావు, రఫీ తదితరులు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో కలాం సేవలను కొనియాడారు. డీసీసీ అధ్యక్షుడు అలెగ్జాండర్ సుధాకర్ తదితరులు ఉన్నారు.


తెదేపా జిల్లా కార్యాలయంలో నివాళి అర్పిస్తూ..

అంతర్ జిల్లా చోరుల అరెస్టు

రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

బల్లికురవ(అద్దంకి), న్యూస్‌టుడే: మోటారు సైకిళ్ల చోరులను బల్లికురవ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అద్దంకి కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించారు. ఎస్సై జీవీ.చౌదరి సమాచారం మేరకు.. పల్నాడు జిల్లా బొల్లాపల్లికి చెందిన జి.నరసింహారావు, బల్లికురవ మండలం కొత్తూరుకు చెందిన టి.నరసింహారావు ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తుంటారు. వీరిద్దరూ గతంలో నరసరావుపేట ఒకటో పట్టణం, శావల్యాపురం, అద్దంకి, పుల్లలచెరువు పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన దొంగతనం కేసుల్లో నిందితులు. ఈనేపథ్యంలో వీరిద్దరూ బల్లికురవ మండలంలోని వి.కొప్పెరపాడు కూడలి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసుల్ని చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. వెంబడించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. వినుకొండ, బల్లికురవ మండలం కొత్తూరులో దొంగిలించిన రెండు ద్విచక్ర వాహనాలను అమ్మేందుకు వెళుతున్నామని చెప్పారు. నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద గల బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.80 వేల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

17 నుంచి దూర విద్యా పరీక్షలు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూరవిద్యా కేంద్రంలో ఈనెల 17 నుంచి యూజీ, పీజీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం పేర్కొన్నారు. మంగళవారం పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లతో రిజిస్ట్రార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని సూచించారు. గతంలో మాదిరిగా అక్రమాలు జరిగితే ఉపేక్షించబోమని చెప్పారు. సీడీఈ సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో సూపరింటెండెంట్లు కీలకమన్నారు. 10 సైన్స్ కోర్సుల నిర్వహణకు అనుమతి వచ్చిందని, త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని సంచాలకులు తెలిపారు. పరీక్షల సమన్వయకర్త డాక్టర్ రామచంద్రన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 114 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఒక్కో కేంద్రంలో పరిశీలకులు, ప్రాంతీయ సమన్వయకర్త, ప్రత్యేక స్క్వాడ్ బృందాలను ఏర్పాటుచేశామన్నారు.

విత్తనం.. మనమే తయారు చేద్దాం

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే

ఖరీఫ్‌లో వరి విత్తనాలకు రైతులు నానా యాతన పడ్డారు. రోజుల తరబడి దుకాణాల ముందు బారులు తీరి అధిక ధరలు చెల్లించడానికి సిద్ధపడినా అనుకున్న విత్తన రకాలు లభించలేదు. వీటి నుంచి విముక్తి కలిగించడానికి ప్రభుత్వం గ్రామీణ విత్తనోత్పత్తి పథకాన్ని ప్రవేశపెట్టింది. గత వైకాపా ప్రభుత్వం దీన్ని తూతూ మంత్రంగా అమలు చేసింది.

❖ జిల్లాలో 9 గ్రామాల్లో 25 ఎకరాల చొప్పున 225 ఎకరాల్లో విత్తనోత్పత్తి పథకం కింద వరి సాగు చేయించాలని నిర్ణయించి అందుకు చర్యలు తీసుకున్నారు. వచ్చే ఖరీఫ్‌కు 25 వేల ఎకరాలకు నాణ్యమైన విత్తనం రైతుల వద్ద లభిస్తుంది. రెండేళ్లలోనే జిల్లాలో వరి విత్తనాలు పూర్తిస్థాయిలో వరి విత్తనాలు రైతులే సొంతంగా ఉత్పత్తి చేసే స్థాయికి ఎదుగుతారు. ఏటా రాష్ట్ర విత్తన ఉత్పత్తి సంస్థ రైతులకు అవసరమైన వరి విత్తనాలను సరఫరా చేస్తుంది. కిలో విత్తనానికి ప్రభుత్వం రూ.10 రాయితీ అందిస్తుంది. రాయితీ మినహా 25 కిలోల విత్తనం రూ.700 నుంచి 800 వరకు కొంటున్నారు.

కొరత అధిగమించేందుకు వ్యవసాయ శాఖ చర్యలు

రైతులకు శిక్షణ

ఈ పథకాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పట్టుదలతో ఉన్నారు. అందుకే కేవలం విత్తనం ఇవ్వడమే కాకుండా పంట కాలంలో పలుసార్లు రైతులకు శిక్షణ ఇస్తారు. విత్తనం సరఫరా, పంట పర్యవేక్షణ చేపడతారు. శిక్షణ కార్యక్రమాలను వ్యవసాయ శిక్షణ కేంద్రానికి అప్పగించారు. శాస్త్రవేత్తలు పంటలను తరుచూ పరిశీలిస్తారు. జిల్లాలోని 9 గ్రామాల్లో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. జిల్లాలో సన్నాలు రకాలనే అధికంగా ఉపయోగిస్తారు. వాటినే సాగు చేపట్టారు

9 గ్రామాల్లో గ్రామీణ విత్తనోత్పత్తి పథకం అమలు

అయినా అవసరమైన విత్తనం లభించలేదు. దీంతో పల్నాడులో అధికంగా రూ.1700 నుంచి 2100 వరకు ధర చెల్లించి సన్న రకాలైన వరి వంగడాలను అన్నదాతలు కొనాల్సి వచ్చింది. అదే రైతులు సొంతంగా తయారు చేసుకుంటే బస్తా విత్తనం రూ.400 నుంచి రూ.450 సిద్ధం చేసుకోవచ్చు.

వరి అమలుకు నిర్ణయం

జిల్లాలో అన్ని పంటల కంటే ఈ ఏడాది వరినే అధికంగా సాగు చేస్తున్నారు. జిల్లాలో వరి సాధారణ విస్తీర్ణం 42 వేల హెక్టార్లు కాగా ఈ ఏడాది 52 వేల హెక్టార్లలో వరిసాగు అయింది. అందుకే ప్రభుత్వం కూడా ఈ ఏడాది విత్తనోత్పత్తి పథకాన్ని వరిపంటకే అమలు చేసింది. గత ప్రభుత్వం ఒక్క వరినే కాకుండా అన్ని రకాల పంటలను ఈ పథకంలో చేర్చి కేవలం విత్తనాలకు రాయితీగా ఇవ్వడం మినహా పెద్దగా పట్టించుకోలేదు. దీంతో రైతులు విత్తనోత్పత్తి పథకం ద్వారా పండించిన విత్తనాలను కూడా సాధారణ ధాన్యంగానే అమ్మారు.

మూల విత్తనం అందించాం

ఎంపికైన రైతులకు మూల విత్తనం అందించాం. ఒక్కొక్క గ్రామంలో 25 మంది రైతులను ఎంపిక చేశాం. 25 ఎకరాల్లో వరి సాగు చేయిస్తున్నాం. పంటను తరచూ పర్యవేక్షిస్తాం. ఉత్పత్తి అయిన ధాన్యం గ్రామంలోని ఇతర రైతులకు విత్తనంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటాం. ఇంకా మిగిలిపోతే విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా కొంటాం.
– ఐ.మురళీ, జిల్లా వ్యవసాయశాఖాధికారి


వరి విత్తనాల కోసం రైతుల బారులు (దాచినచిత్రం)


ఇతర ప్రాంతాల నుంచి విత్తనాలు తెచ్చుకుంటున్న అన్నదాతలు

17న డైకీన్స్ సంస్థ జాబ్‌మేళా

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 17న నరసరావుపేటలో డైకీన్స్ సంస్థలో ఉద్యోగాలకు మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు తెలిపారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని న్యాక్ ట్రైనింగ్ సెంటర్‌లో ఎంపికలు నిర్వహిస్తారన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఎయిర్ కండీషనింగ్ సంస్థ డైకీన్ ప్రతినిధులు ఎంపికలు చేపడతారన్నారు. బీఎస్సీలో గణితం, భౌతిక, రసాయన శాస్త్రాలు, కంప్యూటర్ సైన్సెస్, డిప్లొమాలో మెకానికల్, ప్రొడక్షన్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్, ఆర్‌ఏసీ, ఆటోమొబైల్ కోర్సుల్లో చదువుకుని 2022, 23, 24 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులను అనుమతిస్తామన్నారు. 19- 25 ఏళ్లలోపు వారిని ఎంపిక చేస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ధ్రువపత్రాలు, ఆధార్ నకళ్లు, ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. https://forms.gle/HUJh9einxK8XHJZa9 వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకోనివారు నేరుగా హాజరు కావచ్చని ఆయన తెలిపారు.

వాగుల పక్కన ముమ్మరంగా వరినాట్లు



చిలకలూరిపేట మండలంలోని ఓగేరు, కుప్ప గంజి వాగు పరివాహక ప్రాంతంలోని యడవల్లి, మద్దిరాల, కావూరు, లింగంగుంట్ల, వేలూరు, కుక్కపల్లివారిపాలెం గ్రామాల్లో వరినాట్లు ముమ్మరంగా చేపట్టారు. వరికి నీటి అవసరం ఎక్కువగా కావడంతో మండలంలో వాగుల పక్కనే ఎక్కువగా వరినాట్లు రైతులు చేపడుతారు. **- న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ**

అపార్టుమెంట్‌పై నుంచి పడి విద్యుత్తు ఉద్యోగిని మృతి

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు అపార్టుమెంట్ పైనుంచి పడి విద్యుత్తు ఉద్యోగిని మృతి చెందిన ఘటన మాచర్ల రింగురోడ్డు సెంటర్లో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. అపార్టుమెంట్ 4వ ఫ్లోరులో నివాసముండే బుట్టి నాగేంద్రమ్మ (56) స్థానిక విద్యుత్తు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె కుమారుడు వెంకటేష్ సరకుల కోసం బజారుకు వెళ్లగా.. ఆమె ఇంటి పనిచేస్తూ ప్రమాదవశాత్తు పై నుంచి కింద పడిపోయారు. కుమారుడు ఇంటికి వచ్చి చూడగా తల్లి కనిపించలేదు. ఇల్లంతా వెతికారు. అనంతరం అపార్టుమెంట్ వెనుక భాగంలో నేలపై పడి ఉన్న తల్లిని గుర్తించి హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వెనుక వరండా నుంచి ఆమె ప్రమాదవశాత్తు కింద పడి ఉంటుందని అనుమానిస్తున్నారు.


మృతి చెందిన నాగేంద్రమ్మ

అమ్మ దర్శనం కాకుండానే...

దాచేపల్లి, న్యూస్‌టుడే: అమ్మవారిని దర్శించుకోవడానికి వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురై ఓ భక్తురాలు మృతి చెందారు. దాచేపల్లి కోట్ల బజారులో దుస్తుల దుకాణం నడుపుతూ తురకా అంకమ్మ(43) జీవనం సాగిస్తోంది. దేవి శరన్నవరాత్రుల సందర్భంగా ఆమె దుర్గా మాత మాలధారణ దీక్ష ధరించారు. శనివారం రాత్రి విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి కుమారుడితో కారులో బయలుదేరారు. మార్గమధ్యలో మంగళగిరి సమీపంలోని కాజా టోల్‌ప్లాజా వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో అంకమ్మకు బలమైన గాయాలు కాగా, ఆమె కుమారుడు జగదీష్, డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారిని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అంకమ్మ మృతి చెందారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న అంకమ్మ మృతితో కుమార్తె, కుమారుడు అనాథలు మారారు.


తురకా అంకమ్మ (పాత చిత్రం)

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

వేల్పూరు(అచ్చంపేట) న్యూస్‌టుడే: ట్రాక్టర్ ట్రక్కు ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని వేల్పూరు-క్రోసూరు మధ్య ఆర్‌అండ్‌బీ రహదారిపై బీజే డిగ్రీ కళాశాల సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అచ్చంపేట మండలం పెదపాలేనికి చెందిన వెంకటేశ్వర్లు(20) ద్విచక్ర వాహనంపై క్రోసూరు వైపు వెళుతున్నాడు. అదే సమయంలో క్రోసూరు వైపు వెళుతున్న ట్రాక్టర్ ట్రక్కును ఢీకొన్నాడు. ఘటనలో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. తండ్రి గోపయ్యకు ఇద్దరు సంతానం. పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.


మృతి చెందిన వెంకటేష్

జిల్లా స్టెప్ ఇన్‌ఛార్జి సీఈవోగా విజయలక్ష్మి

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లా యువజన సేవలు- స్టెప్ ఇన్‌ఛార్జి సీఈవోగా టి.వి. విజయలక్ష్మిని నియమిస్తూ జిల్లా కలెక్టరు ఎస్.నాగలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ఇటీవలే డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరుగా బాధ్యతలు స్వీకరించారు. స్టెప్ సీఈవో పోస్టు ఖాళీగా ఉండడంతో ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఆరోగ్య కార్యకర్తలకు ఉద్యోగోన్నతి

గుంటూరు వైద్యం : వైద్య ఆరోగ్య శాఖలో ఆరోగ్య కార్యకర్త(మహిళ)లుగా పనిచేస్తూ జీఎన్ఎం శిక్షణ పూర్తయిన వారికి స్టాఫ్‌నర్సులుగా ఉద్యోగోన్నతిస్తూ ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు సుచిత్ర మంగళవారం ఆదేశాలిచ్చారు. మొత్తం 8 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి వారు ఎంపిక చేసుకున్న ఆసుపత్రికి బదిలీ చేశారు.

ఉద్యోగం కావాలంటే ఎమ్మెల్యే సిఫార్సు ఉండాలా?

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : ఉద్యోగం కావాలంటే ఎమ్మెల్యే సిఫార్సు కావాలనటం సిగ్గుచేటని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు అన్నారు. 13 రోజులుగా మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఒప్పంద కార్మికులు, ఇంజనీరింగ్ ఉద్యోగులు మంగళవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ వేధింపుల ప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్న కార్మికులు, ఉద్యోగుల ఆనందం కొన్ని రోజులకే ఆవిరైందన్నారు. వేతనాలు పెంచి కనీస వేతనాలు అమలు చేస్తారన్న ఆశలు ఆడియాశ అవుతుండటంతో పాటు ఉద్యోగాల నుంచి తొలగిస్తుండటంతో ఉద్యోగులు, కార్మికులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. 55 మందిని అక్రమంగా ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి వారిని విధుల్లోకి తీసుకోవాలని, లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ముత్యాలరావు, సిలార్ మసూద్, అల్లాభక్షు, నాగమల్లేశ్వరి, రమాదేవి, సుభాని, సైదా, రమణ, పద్మ పాల్గొన్నారు.

నవంబరులో శృంగేరీ జగద్గురువుల రాక

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: శృంగేరీ శారదా పీఠం ప్రతినిధులు మంగళవారం డీజీపీ ద్వారకా తిరుమలరావును ఆయన కార్యాలయంలో కలిశారు. శృంగేరీ పీఠాధిపతి విధుశేఖర భారతి మహాస్వామి నవంబరు నెలలో చేపట్టిన విజయయాత్ర గురించి డీజీపీకి వివరించారు, స్వామియాత్రలో పాల్గొని ఆశీసులు పొందాల్సిందిగా ఆయనను ఆహ్వానించారు. డీజీపీని కలిసిన వారిలో గుంటూరుకు చెందిన హోమియోపతి వైద్యుడు ఓవీ రమణ తదితరులున్నారు. స్వామి నవంబరు 18 నుంచి 20 వరకు విజయవాడ సత్యనారాయణపురంలోని శ్రీశృంగేరీ పీఠ పరిపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో బస చేస్తారు. 21 నుంచి 24 వరకు గుంటూరు శ్రీశృంగేరీ పీఠంలో బస చేస్తారని, పలు కార్యక్రమాల్లో పాల్గొని అనుగ్రహభాషణలు చేస్తారని ప్రతినిధులు తెలిపారు.

చేతుల పరిశుభ్రత బాధ్యత

నాదెండ్ల : ఆహారం తీసుకోవడానికి ముందు, తర్వాత చేతులను శుభ్రం చేసుకుంటే రోగాలు దరి చేరవని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు పద్మ తెలిపారు. చిరుమామిళ్ల మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కులు పాల్గొన్నారు.

35 వేలకు పైగా మిర్చి బస్తాల విక్రయం

మిర్చియార్డు, న్యూస్‌టుడే: మిర్చియార్డులో 35 వేలకు పైగా బస్తాల విక్రయాలు జరిగాయి. రైతులు మంగళవారం 38,191 బస్తాలు యార్డుకు తరలించారు. అందులో 35,674 బస్తాలు విక్రయాలు జరిగాయి. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 23,325 బస్తాలు నిల్వ ఉన్నాయి. నాన్ ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.8000-16500, నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.9000-18500, తాలు మిర్చికి రూ.5000-11500, ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.8500-16000, ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.9200-18300, తాలు మిర్చికి రూ.5000-10500 ధర లభించింది.

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, రిటైల్ ధర - 157, చికెన్ విత్‌స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 268 చికెన్ స్కిన్‌లెస్ - 278.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

నరసరావుపేట

• నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట



చెరువులో కూలిన విద్యుత్తు స్తంభం

నూజండ్ల, న్యూస్‌టుడే : ఎడతెరిపి లేని వర్షానికి నూజండ్ల చెరువు కట్ట మీదుగా ఉన్న విద్యుత్తు లైన్‌లోని ఓ స్తంభం చెరువులోకి పడిపోయింది. గ్రామస్థులు గమనించి సరఫరా నిలిపి వేయించారు. నూజండ్ల ఉప కేంద్ర నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు వెంబడి ఏర్పాటు చేసిన లైన్‌లో పలు స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా మారాయి. నూజండ్ల, పమిడిపాడు చేపల చెరువుల కోసం ప్రత్యేక లైన్ ఏర్పాటు చేశారు. గతంలో వర్షానికి రెండు స్తంభాలు పడిపోయి సరఫరా నిలిచింది. ప్రతిసారి లైన్‌లో సమస్యలు తలెత్తుతూ ఉండటంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వరిలో ఎండు తెగులు నివారణకు సూచనలు

రొంపిచర్ల, న్యూస్‌టుడే : వరిలో ఎండు తెగులు నివారణకు కంటాఫ్ పిచికారి చేయటంతో పాటు పొటాష్ వాడితే రోగ నిరోధకశక్తి పెరిగి నివారించుకోవచ్చని నరసరావుపేట ఏడీఏ ఎస్వీనాయక్ తెలిపారు. మండలంలోని అన్నవరం, తుంగపాడులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో వరి పొలాలు పరిశీలించారు. అనంతరం ఏడీఏ, ఏవో బి.శివలలిత మాట్లాడుతూ పీఎం కిసాన్ నగదు జమ కావటానికి బ్యాంకు ఖాతా చలామణిలో ఉంచుకోవాలని, ఆధార్ అనుసంధానం, ఈకేవైసీ పూర్తి చేసుకుని ఉండలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు బీజామృతం తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? విప్పర్ల పంచాయతీ పరిధిలోని అంజిబాబుకాలనీ, ఎస్సీకాలనీలో వీధి దీపాలు వెలగటం లేదు. దీపాలు ఏర్పాటు చేయాలి. **-శేషుమెహర్, విప్పర్ల**

✔ రెండు రోజుల్లో కాలనీల్లో వీధి దీపాలు కొత్తవి ఏర్పాటు చేస్తాం. **-సతీష్, పంచాయతీ కార్యదర్శి, విప్పర్ల.**

–రొంపిచర్ల, న్యూస్‌టుడే

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

శావల్యాపురం, న్యూస్‌టుడే : ప్రభుత్వం నిర్దేశించిన అంశాలు అంతర్జాలంలో నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని నరసరావుపేట ఉప వైద్యాధికారిణి మక్కెన పద్మావతి తెలిపారు. మంగళవారం శావల్యాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఆరోగ్య కార్యకర్తల పని తీరును తనిఖీ చేసి అంతర్జాలంలో వివరాలు నమోదు చేయని సిబ్బందిని ఆరోగ్య కేంద్రానికి పిలిపించి సూచనలు చేసి, లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష చేపట్టారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలోని రోగుల వివరాల పట్టిక, రక్త పరీక్షల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి రమ్య, సూపర్‌వైజరు ఉమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయునికి పంచామృతాభిషేకం



ఆలయంలో హనుమాన్ చాలిసా పారాయణం

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : బొప్పూడి ప్రసన్నాంజనేయునికి మంగళవారం పంచామృత అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చక బృందం దివి పవనాచార్యులు, చరణ్, చక్రవర్తి, అంజి స్వామి ఆధ్వర్యంలో ఇది కొనసాగింది. అనంతరం తూబాటి బాలకృష్ణ, సుమలత దంపతుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో పూనూరుకు చెందిన భక్త బృందం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా ఉదయం నుంచి సాయంత్రం వరకు పఠించారు.

గ్రామ సచివాలయాల తనిఖీ

ఈపూరు, న్యూస్‌టుడే : మండలంలోని ఈపూరు, ఇనుమెళ్ల గ్రామ సచివాలయాలను నరసరావుపేట డీఎల్‌డీవో వెంకటరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, కార్యాలయ దస్త్రాల నిర్వహణ అమలు తీరును తనిఖీ చేశారు. సిబ్బందితో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. అత్యవసర ఫోను నంబర్లు, పౌర పట్టిక ప్రదర్శించాలని ఆదేశించారు.

గుంతల దారుల్లో... అవస్థల ప్రయాణం

రొంపిచర్ల, న్యూస్‌టుడే



ఎడ్వర్డుపేట వెళ్లే రహదారి దుస్థితి

ఎన్నికల ముందు వైకాపా ప్రభుత్వం మండలంలోని ఎడ్వర్డుపేటకు వెళ్లే రోడ్డు, తుంగపాడు రోడ్లను తవ్వించి కంకరు, డస్టు పోయించింది. ఈ లోపు ఎన్నికల కోడ్ రావటంతో నూతన రోడ్ల నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అన్నవరం- సంతగుడిపాడు మధ్య రూ.కోట్ల వ్యయంతో 2010లో రోడ్డు నిర్మించారు. ఈ రహదారి మరమ్మతులకు గురైంది. సంతగుడిపాడు వద్ద రాష్ట్రీయ రహదారి నుంచి కర్లకుంట వెళ్లే మార్గం దుస్థితి దారుణంగా మారింది. రొంపిచర్ల నుంచి వడ్లమూడివారిపాలెం వెళ్లే రహదారి మార్కెట్ యార్డు సమీపంలో కుంగి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఏళ్ల తరబడి రోడ్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గణపవరం సినిమాహాలు సెంటర్‌లో మలుపు వద్ద పెద్ద గుంతలో నీరు



చిలకలూరిపేట ఎన్ఆర్‌టీ సెంటర్ మలుపు వద్ద గుంతలో..

చిలకలూరిపేట పట్టణంలో, మండలంలో రాకపోకలు ఎక్కువగా సాగే ప్రధాన సెంటర్ల వద్ద గుంతలు ఏర్పడి నీరు నిలుస్తుండటంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గణపవరం సినిమాహాలు సెంటర్ మలుపు వద్ద పెద్ద గుంత ఏర్పడి వర్షానికి నీరు నిలిచింది. ఇదే పరిస్థితి చిలకలూరిపేట ఎన్ఆర్‌టీ సెంటర్ వద్ద ఉంది. ఈ రెండు చోట్ల రాత్రి వేళల్లో వాహనాలతో గుంతలో పడితే ప్రమాదాలు జరిగే అవకాశం పొంచి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


- చిలకలూరిపేట గ్రామీణ, గణపవరం, న్యూస్‌టుడే



రొంపిచర్లలో శిలఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న చదలవాడ, గోనుగుంట్ల, అధికారులు



శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



గండిగనుమల తండాలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు

పల్లె పండగతో గ్రామ స్వరాజ్యం

నూజండ్ల, న్యూస్‌టుడే : పల్లె పండగతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమని ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జడ్పీటీసీ జడ్డా సుబ్బులు అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పమిడిపాడు, ముతరాసుపాలెం, తెల్లబాడు, కంభంపాడు పంచాయతీల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, గోకుల షెడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు.

శావల్యాపురం : మండలంలోని గుంటుపాలెంలో రూ.8 లక్షలతో చేపట్టనున్న మురుగు కాలువల నిర్మాణానికి భూమిపూజ చేపట్టారు. ప్రముఖ వైద్యుడు అన్నవరపు వీరాంజినేయులు, ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య, వయ్యకల్లు సర్పంచి గోనుగుంట్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రొంపిచర్ల : మండలంలోని అన్నవరం, రొంపిచర్ల, కొనకంచివారిపాలెం, గోగులపాడులో సీసీ రోడ్ల నిర్మాణానికి, బీటీ రోడ్డు ఏర్పాటుకు ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు శంకుస్థాపన చేశారు.

ఈపూరు : మండలంలోని కొచ్చెర్లలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి, మినీ గోకులం షెడ్డు నిర్మాణాలకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకరరావు, ఏపీవో లక్ష్మణరావు, అయినాల కోటేశ్వరరావు, నెల్లూరి శివరామయ్య పాల్గొన్నారు.

యడ్లపాడు : అధికారంలో ఉన్నప్పుడు అరాచకాలకు పాల్పడిన వైకాపా నాయకులు.. నేడు చట్టం నుంచి తప్పించుకోలేరని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేటలో రూ.13 లక్షల ఉపాధి నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే భూమిపూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు.

బొల్లాపల్లి : సొంత బ్రాండ్లు సృష్టించి నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యాన్ని గుల్ల చేసిన జగన్.. కూటమి ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తున్న మద్యం పాలసీపై విమర్శలు చేయడం సిగ్గుచేటని శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని రావులాపురం, గండిగనుమలలో పల్లెపండగ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సుమారు రూ.20 లక్షల విలువైన రోడ్లు, కాలువల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో జిలానీ బాషా, సర్పంచులు పుల్లారెడ్డి, శ్రీనునాయక్, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ నాగేశ్వరరావు, తెదేపా మండల అధ్యక్షులు గోవిందనాయక్, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

వినుకొండ రూరల్ : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని సర్పంచి వీరగంధం ఆనంద్ అన్నారు. మంగళవారం ఉమ్మడివరం, నాగులవరం, గోకనకొండ, వెంకుపాలెంలో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలకు భూమిపూజ చేశారు.

రోడ్డు దిగితే ప్రమాదమే



రహదారి పక్కన బరమ్స్ లేక పంట కాల్వల్లా పారుతున్న వర్షం నీరు

చిలకలూరిపేట నుంచి నరసరావుపేట వెళ్లే రహదారి బరమ్స్ లేక ప్రమాదకరంగా మారింది. వర్షం పడితే చాలు రహదారి పక్కన పంట కాల్వలను తలపించేలా నీరు ప్రవహిస్తోంది. అధికారులు స్పందించి రహదారి పక్కన బరమ్స్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం**

రైతులకు అవగాహన



పత్తి సాగులో సూచనలిస్తున్న ఏవో హరిప్రసాదు

ఇర్లపాడు, అప్పాపురం (నాదెండ్ల), న్యూస్‌టుడే : ఇర్లపాడు, అప్పాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ మండల అధికారి హరిప్రసాదు రైతులకు ఆధునిక పద్ధతిలో లాభదాయకమైన సాగు విధానాన్ని వివరించారు. పత్తి, మిరప పంటలో ప్రస్తుతం చేపట్టాల్సిన సస్య రక్షణ వివరాలు తెలియజేశారు. పశు సంవర్ధక శాఖ వైద్యుడు సాంబశివరావు పశువులకు వ్యాపిస్తున్న రోగాలకు నివారణ చర్యలు సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ పర్యవేక్షకుడు నరసింహారెడ్డి, వీఆర్వోలు, ఉద్యాన శాఖ గ్రామ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఏళ్లు గడుస్తున్నా సమస్యలు తీర్చరే?

మౌలిక వసతుల మాట మరిచారు ★ ఎన్జీవో కాలనీలో ప్రజలకు ఇబ్బందులు

నరసరావుపేట అర్బన్, నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే

పట్టణంలోని ఎన్జీవోకాలనీలో కలిసి ఉన్న పలు ప్రాంతాల్లో మురుగు కాలువలు, రహదారుల నిర్మాణం చేపట్టలేదు. గత తెదేపా ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులు కూడా వైకాపా పాలనలో కుంటుపడ్డాయి. వాటిని తిరిగి ప్రారంభించాలన్న లక్ష్యం అధికారుల్లో లేదు. భారీగా ఆస్తి పన్నుల వసూళ్లు చేస్తున్నా... కొన్ని రూ.లక్షలు వెచ్చిస్తే వాటిని పూర్తి చేయవచ్చు.



పోస్టల్ కాలనీ మొదటి లైనులో రహదారి దుస్థితి



విద్యుత్తు స్తంభానికి అలుముకున్న పిచ్చితీగలు

పోస్టల్ కాలనీ ప్రాంతంలో

ఎన్జీవోకాలనీకి ఆనుకుని పోస్టల్ కాలనీ ఉంది. ఇది ఏర్పడి రెండు దశాబ్దాలు దాటింది. గతంలో రావిపాడు పంచాయతీ పరిధిలో ఉన్న కాలనీ తర్వాత పురపాలిక సంఘంలో విలీనమైంది. వందల గృహాలు నిర్మించుకుని ప్రజలు జీవనం సాగిస్తున్నారు. మురుగు పారేందుకు మార్గం లేక ఖాళీ స్థలాల్లోకి వెళుతోంది. అంతే కాకుండా మట్టిరోడ్లు కావడంతో చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతున్నాయి. పైపులైన్లు విస్తరించక తాగునీటికి సమస్యగా మారింది. సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో విస్మరించారు

గత ప్రభుత్వ హయాంలో మా కాలనీని పాలకులు, అధికారులు పూర్తిగా విస్మరించారు. కనీస సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యారు. పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. వీధి దీపాలు వెలగడంలేదు. కాలనీలో ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్నాయి. రహదారులు, మురుగు వ్యవస్థ ఏర్పాటు చేయాలి.

-శ్రీనివాసరావు, స్థానికుడు

చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యం



ఆదర్శ పాఠశాలలో చేతుల పరిశుభ్రత గురించి వివరిస్తున్న సీహెచ్‌వో

వినుకొండ రూరల్ : వినుకొండ మండల పరిషత్ కార్యాలయం, చీకటీగలపాలెం ఆదర్శ పాఠశాల, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు చేతుల శుభ్రతపై కార్యక్రమం నిర్వహించారు. వారితో ప్రతిజ్ఞ చేయించారు. సీహెచ్‌వో ఝాన్సీలక్ష్మీ చేతుల పరిశుభ్రతలో 7 దశలు చేసి చూపించారు. ఎంపీడీవో పుట్టారెడ్డి, ప్రిన్సిపల్ విజయలక్ష్మి, ఈవోపీఆర్డీ సుందరరెడ్డి, ఎంఈవో ప్రభాకరరావు, కార్యదర్శులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచర్ల : రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం బీఎం.సుభానీ, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మండల సమన్వయకర్త సుబ్బారెడ్డి, ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, పీడీ సైదయ్య పాల్గొన్నారు.

శావల్యాపురం : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు, వ్యక్తిగత శుభ్రత పాటించాలని వెలుగు ఏపీఎం జి.వాసుబాబు తెలిపారు. మంగళవారం ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా శావల్యాపురం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంకు సిబ్బంది, వెలుగు యానిమేటర్లు నారాయణమ్మ, రేణుక పాల్గొన్నారు.

నూజండ్ల : చేతులు శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉండగలమని స్వచ్ఛభారత్ మండల సమన్వయకర్త కంచర్ల సుబ్బరామయ్య అన్నారు. ప్రపంచ చేతుల శుభ్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం పువ్వాడ, ములకలూరులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మన చేతుల్లోనే మన ఆరోగ్యం ఉందని గుర్తించాలని, చేతుల్లో ఉండే బ్యాక్టీరియా, వైరస్‌లతో అతిసారం వస్తుందని చెప్పారు. బాల్యదశ నుంచి పిల్లలకు చేతుల శుభ్రతపై అవగాహన కలిగించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు, ఆరోగ్య కార్యకర్త కుమారి, ఉపాధ్యాయులు గంగాధర్ తిలక్, శ్రీనివాస్ నాయక్, గోపీకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిలకలూరిపేట పట్టణం : మద్రి చెన్నారెడ్డి పురపాలక సంఘ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు.

యోగాలో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినికి ధ్రువపత్రం ఇస్తున్న ప్రిన్సిపల్

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : తిరుమల ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని ఏసు మరియమ్మ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో రాణించి బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ నారాయణ తెలిపారు. కళాశాల విద్యార్థులు సంప్రదాయ యోగా, రిథమిక్ యోగా, ఆర్టిస్టిక్ యోగా తదితర అంశాల్లో రాణించి రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. మంగళవారం కళాశాలలో విద్యార్థినిని అభినందించారు.

సస్యరక్షణపై రైతులకు అవగాహన

యడ్లపాడు: మండలంలోని జాలాది, జగ్గాపురం, ఉన్నవలో వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఏవో సరిత పత్తిచేలను క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రామసభ నిర్వహించారు. అధిక వర్షాల నుంచి పంటను కాపాడుకోవటానికి సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

వినుకొండ రూరల్ : రైతులు కంది, వరి, మిరప, పొగాకు పంటల్లో ఎరువుల యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం, నరసరావుపేట డిప్యూటీ డైరక్టర్ శివకుమారి తెలిపారు. నరగాయపాలెం రైతు సేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

మట్టి మిద్దెకూలి మహిళకు గాయాలు

ఈపూరు, న్యూస్‌టుడే : మండలంలోని ఊడిజర్లలో మట్టి మిద్దె కూలి మహిళకు గాయాలయ్యాయి. వర్షాలతో మట్టి మిద్దె నాని సోమవారం రాత్రి కూలగా ఇంట్లో నిద్రిస్తున్న ఆవులమంద మన్నెమ్మ మట్టిలో కూరుకు పోయింది. తలపై కర్ర దుంగలు పడటంతో గాయాలయ్యాయి. ఆమె కేకలు వేయగా సమీప ఇళ్లవారు వచ్చి ఆమెను బయటకు తీశారు. తెదేపా గ్రామ నేతలు పాపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, చాగంరెడ్డి శ్రీనివాసరెడ్డి, నలగంగుల వెంగళరెడ్డి పడిపోయిన ఇంటిని పరిశీలించి బాధితురాలిని పరామర్శించారు.

పురపాలక సంఘ కార్మికులకు సమ దుస్తుల పంపిణీ

వినుకొండ: రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్మికులకు రూ.20 వేల సమదుస్తులు పంపిణీ చేశారు. పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ చేతుల మీదుగా అందజేశారు. ఆయన రోటరీ సభ్యుల సేవలను ప్రశంసించారు. క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి ఏరువ వెంకటనారాయణ, ఆర్థిక కార్యదర్శి ఎస్‌కే మస్తాన్, మాజీ అధ్యక్షుడు గిరిబాబు, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓట్లు నమోదు చేయించండి

నరసరావుపేట టౌన్: కృష్ణా- గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించాలని మాజీ ఎమ్మెల్యే, వైకాపా నేత గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సూచించారు. నరసరావుపేట వైకాపా కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. పార్టీ బలపరిచిన అభ్యర్థి విజయానికి ఇప్పటి నుంచే కార్యకర్తలు కృషి చేయాలని చెప్పారు.

కలాంకు ఘన నివాళి



ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

నరసరావుపేట అర్బన్ : మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల, నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల, ఏఎం రెడ్డి విద్యాసంస్థల్లో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

వినుకొండ : మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం అందరికి ఆదర్శమని ఏపీ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ మోహన్ తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో మంగళవారం కలాం జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు లింగయ్య, కన్నెగంటి ఫౌండేషన్ అధ్యక్షుడు నారాయణపురం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట పట్టణం : విద్యావేత్త, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. జనసేన కార్యాలయంలో, ఏఐవైఎఫ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో కలాం చిత్రపటాలకు నివాళి అర్పించారు. రైతు బజారు వద్ద ఉన్న కలాం విగ్రహానికి పూల దండలు వేశారు.

నరసరావుపేట వ్యవసాయం : మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చూపిన మార్గం నుంచి మనందరం స్ఫూర్తిని పొందాలని నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. రొంపిచర్లలో మంగళవారం భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యేతో పాటు తెదేపా రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు, తెదేపా నేతలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న అభయాంజనేయస్వామి

నూజండ్ల, న్యూస్‌టుడే : మండలంలోని ముక్కెళ్లపాడులో అభయాంజనేయస్వామి, పోలేరమ్మ ఆలయాల వార్షికోత్సవం, తిరునాళ్ల మంగళవారం నిర్వహించారు. అమ్మవారికి, స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. భక్తులు పొంగళ్లు చేసి నైవేద్యంగా సమర్పించారు. స్వామిని పురవీధుల్లో ఊరేగించారు. సర్పంచి సింగంశెట్టి వెంకటబాల ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు చంద్రా రామకృష్ణ పాల్గొన్నారు.

శ్రీచక్ర సిమెంట్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న సిమెంట్ ఫ్యాక్టరీ మేనేజర్లు రాజేంద్రప్రసాద్, రవికుమార్

కారంపూడి, న్యూస్‌టుడే: సిమెంట్ రంగంలో ఉత్తమ నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్న స్థానిక శ్రీచక్ర సిమెంట్ ఫ్యాక్టరీకి భారత ప్రామాణిక సంస్థ (బీఐఎస్) ప్రశంసా పత్రాన్ని అందించింది. విజయవాడలో వరల్డ్ స్టాండర్డ్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఫ్యాక్టరీ మేనేజర్ రాజేంద్రప్రసాద్, రవికుమార్‌కు ప్రశంసా పత్రాన్ని బీఐఎస్ ప్రతినిధులు అందజేశారు.

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

ఆర్బీకేల్లో ఎరువుల నిల్వలు



గ్రామసభలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు

పిడుగురాళ్ల: రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ సహాయ సంచాలకులు బి.శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. మంగళవారం కొనంకి, పాతగణేశునిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతుసేవా కేంద్రాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆయన రైతులకు పంటల సాగుపై పలు సూచనలు చేశారు. వ్యవసాయ అధికారులు ఎస్.శ్రీనివాసరెడ్డి, పి.ప్రవీణ్ పాల్గొన్నారు. పట్టణంలోని ఎరువులు, పురుగుమందు దుకాణాల్లో వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి తనిఖీలు చేశారు. స్టాకు రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు పరిశీలించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
మాచర్ల గ్రామీణ: 80085 73181 గురజాల: 80085 7 3176

? గురజాల కర్లగాగారి వీధిలో మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. దుర్వాసన వస్తోంది. - జె.శివకోటేశ్వరరావు

✔ మురుగు తొలగించి సమస్య తీరుస్తాం. - శ్రీనివాసరావు, నగర పంచాయతీ కమిషనర్

– న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ

? పట్టణంలోని రఘురామ్‌నగర్ రామచంద్ర బాలకుటీర్ పాఠశాల బజారులో మురుగు కాలువ అధ్వానంగా ఉంది. దోమలు పెరిగి దాడి చేస్తున్నాయి. - స్థానికులు, బాలకుటీర్ బజార్

✔ ప్రజారోగ్య సిబ్బందిని పంపించి మురుగు కాలువలు శుభ్రతకు చర్యలు చేపడతాం. - షమ్మి, మున్సిపల్ కమిషనర్

? పట్టణంలోని 19వ వార్డు సుందరయ్యకాలనీలో మురుగు కాలువలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. - స్థానికులు, సుందరయ్యకాలనీ

✔ మురుగు కాల్వల్లో చెత్త, వ్యర్థాలు పడేయకుండా చూస్తాం. - షమ్మి, మున్సిపల్ కమిషనర్

– న్యూస్‌టుడే, సత్తెనపల్లి

ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

బెల్లంకొండ, న్యూస్‌టుడే: ఒప్పంద అధ్యాపకుల రెగ్యులరైజేషన్ వెంటనే ప్రారంభించాలని, జీవో 114ను అమలు చేయాలని బెల్లంకొండ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 3618 మంది కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు రమేష్ బాబు డిమాండ్ చేశారు. పసుపు రంగు బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 19 వరకు ప్రతి రోజూ వినూత్న రీతిలో నిరసన తెలియజేస్తామన్నారు.

పంటి బిగువున భరించాల్సిందే..!

✦ సామాజిక మరుగుదొడ్లు లేక అవస్థలు
✦ మహిళలకు తీవ్ర ఇబ్బందులు



అచ్చంపేట రోడ్డులోని రైల్వేగేటు సమీపంలో నిరుపయోగంగా సామాజిక మరుగుదొడ్లు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

పల్నాడులోని పట్టణాలు, గ్రామాల నుంచి రోజూ వేలాది మంది వివిధ పనులపై వస్తుంటారు. వారి అవసరాలపై దృష్టి సారించాల్సిన మున్సిపాల్టీలు పట్టించుకోవట్లేదు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో స్వచ్ఛభారత్ మిషన్ నిధులతో సామాజిక మరుగుదొడ్ల నిర్మాణాల్ని పట్టణాల్లో చేపట్టారు. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు ఒక్కటి కూడా నిర్మించలేదు. దీంతో చెప్పుకోలేని అవసరానికి పంటి బిగువున బాధను భరించాల్సిన దుస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం, మున్సిపాల్టీలు మహిళల అత్యవసరాలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

☛ సత్తెనపల్లిలో అచ్చంపేట రోడ్డులోని రైల్వేగేటు వద్ద మున్సిపాల్టీ నిధులు రూ.7.50 లక్షలతో సామాజిక మరుగుదొడ్ల సముదాయాన్ని నిర్మించారు. దాన్ని సక్రమంగా నిర్వహించకపోవడంతో పక్కనే సామూహిక మల మూత్ర విసర్జన జరుగుతున్నట్లు గుర్తించి ఓడీఎఫ్ ఇచ్చేందుకు కేంద్ర బృందం నిరాకరించింది. ఆ తర్వాత కూడా పరిస్థితిలో మార్పు రాలేదు. నాడు.. నేడు పనుల్లో భాగంగా మరుగుదొడ్ల సముదాయం ముందు నుంచి జడ్పీ సుగాలి ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మించారు. దీంతో సామాజిక మరుగుదొడ్లు ఉపయోగపడట్లేదు. ఐదులాంతర్ల సెంటర్‌లో మరుగుదొడ్ల నిర్మాణ అవసరంపై కౌన్సిల్‌లో చర్చించి నిధుల మంజూరుకు తీర్మానాలు చేసినా పనులు పూర్తి చేయలేదు. అవసరమైన ప్రాంతాల్లో నిర్మిస్తామని మున్సిపల్ కమిషనర్ షమ్మి తెలిపారు.

అయిదేళ్లుగా అంతే..



జాతీయ రహదారిపై ప్రధాన బస్టాండ్ సెంటర్ వద్ద..

దాచేపల్లి: నగర పంచాయతీగా దాచేపల్లి ఏర్పడి అయిదేళ్లు గడుస్తున్నా.. సామాజిక మరుగుదొడ్ల ఊసేలేదు. వివిధ పనుల నిమిత్తం వస్తున్న మహిళలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారిపై బస్టాప్, మార్కెట్ యార్డు ప్రాంతాలు రద్దీగా ఉంటాయి. అక్కడ మరుగుదొడ్లు లేవు. ఆరు బయట కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాల్సి ఉంది.

పట్టణం విస్తరిస్తున్నా..



సినిమా హాలు సెంటరు దిగువ భాగంలో..

పిడుగురాళ్ల: లైమ్‌సిటీ పిడుగురాళ్లల్లో సామూహిక మరుగుదొడ్లు లేక జనం అల్లాడుతున్నారు. ముఖ్యంగా జానపాడురోడ్డు, సినిమాహాలు సెంటరు వ్యాపార కేంద్రాలుగా విస్తరిస్తున్నాయి. ఆయా ప్రాంతాలకు నిత్యం పలు గ్రామాల నుంచి వందల సంఖ్యలో జనం వస్తున్నారు. ఇక్కడ సామూహిక మరుగుదొడ్ల సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బహిరంగంగా మూత్ర విసర్జన చేస్తున్నారు. అలాగే మాయబజారు, ఐలాండ్ సెంటరులోనూ అదే పరిస్థితి. జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో సామూహిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



వైకాపా హయాంలో కూల్చిన మరుగుదొడ్లు

కట్టినవి కూల్చేశారు..

మాచర్ల (కారంపూడి): నిర్వాహకుడికి తెదేపా అండ ఉందన్న అక్కసుతో బస్టాండు మొదట్లో నిర్మించిన సామాజిక మరుగుదొడ్లను కూల్చి వేశారు. దీంతో ప్రయాణికులకు, బాటసారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మాచర్ల పట్టణానికి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి గ్రామీణులు, ప్రయాణికులు వస్తున్నారు. అత్యవసర వేళ వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీ పాలకులు ప్రజా అవసరాలు గుర్తించి తక్షణం మరుగుదొడ్లు నిర్మించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

'బీమా పాలసీల్లో పాత విధానాలు కొనసాగించాలి'

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: ఈనెల నుంచి అమలు చేస్తోన్న కొత్త పాలసీలకు వర్తింపజేస్తున్న కొత్త నిబంధనలను రద్దు చేసి పాత విధానాలను కొనసాగించాలని జీవిత బీమా ఏజెంట్ల సంక్షేమ సంఘం(లియాఫి) సత్తెనపల్లి అధ్యక్షుడు మంచాల రమేష్ డిమాండు చేశారు. సత్తెనపల్లి జీవిత బీమా సంస్థ కార్యాలయం వద్ద మంగళవారం లియాఫి నాయకులు, ఏజెంట్లు ఆందోళన నిర్వహించారు. కొత్త పాలసీలు కనిష్ఠంగా రూ.2 లక్షల విలువైనవి తీసుకోవాలన్న నిబంధన సరికాదన్నారు. ప్రీమియం పెంపు, బోనస్ తగ్గించడం, జీఎస్టీ రద్దు చేయకపోవడంతో ఇరువురికీ నష్టమేన్నారు. ఈ మేరకు శాఖ మేనేజర్ సురేష్‌కు డిమాండ్ల పత్రాన్ని అందజేశారు.



సత్తెనపల్లి: ప్రజావేదికలో నివాళులర్పిస్తున్న తెదేపా నాయకులు



పిడుగురాళ్ల: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని తదితరులు

కలాం జీవితం ఆదర్శనీయం

భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాల సాకారానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని వక్తలు అన్నారు. అబ్దుల్ కలాం జయంతి వేడుకల్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కలాం చిత్రపటం, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలు కొనియాడారు.

– న్యూస్‌టుడే, బృందం



సత్తెనపల్లి: కలాం విగ్రహం వద్ద వివిధ సంఘాల నాయకుల నివాళి



భైరవునిపాడులో భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి



రాజుపాలెం: ప్రజా వినతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



గారపాడులో సీసీ రహదారి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్, అధికారులు

పల్లెల్లో ప్రగతి పరుగు

రాజుపాలెం, న్యూస్‌టుడే: ప్రజలకు అందుబాటులో ఉంటూ.. వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన రెడ్డిగూడెం, ఆకులగణపవరం, బలిజేపల్లి, ఇనిమెట్ల గ్రామాల్లో పర్యటించారు. సిమెంటు రహదారులు, గోకులంషెడ్లు, సైడు కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదిని ప్రారంభించారు. ప్రజల నుంచి సమస్యలపై వినతులను స్వీకరించారు.

గారపాడు(పెదకూరపాడు): నియోజకవర్గంలోని పల్లెలను సంపూర్ణంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం గారపాడులో రూ.20 లక్షలతో సీసీ రహదారులు, గోకులం షెడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

విజయపురిసౌత్, మాచర్ల: మాచర్ల మండలం భైరవునిపాడు, జమ్మలమడకలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి మంగళవారం భూమిపూజ నిర్వహించారు. నియోజకవర్గంలోని రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.117.75 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి తెలిపారు.

నడవాలన్నా కష్టమే..



ఆర్అండ్‌బీ బంగళా మీదుగా జలవనరులశాఖ ఈఈ, ఆర్డీవో కార్యాలయాలు, రైతుబజారు, పట్టణ ఆరోగ్య కేంద్రం, నాగార్జునా నగర్‌లోకి వెళ్లే రహదారి దుస్థితి ఇది. చిన్నపాటి వర్షానికే ఇలా బురదమయంగా మారుతోంది. నడవడానికి కష్టపడాల్సిందే. ఆర్డీవో కార్యాలయం ప్రధాన గేటు ముందు వర్షపు నీరు తటాకంలా ఉన్నాయి. ఈ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని ఎన్నోసార్లు ప్రజలు విజ్ఞాపనలు అందజేసినా బుట్టదాఖలయ్యాయి. ఇప్పటికైనా శాశ్వత రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సత్తెనపల్లి

పర్యాటక హోటల్‌కు విముక్తి



మద్యం దుకాణం నిర్వహిస్తున్న హరితా హోటల్

అమరావతికి వచ్చే పర్యాటకుల కోసం హరితా హోటల్ నిర్మించారు. దాని పక్కనే కాలచక్ర మ్యూజియం ఉంది. దీన్ని సందర్శించిన పర్యాటకులు హోటల్‌లో ఆకలి తీర్చుకునే వారు. అటువంటి హోటల్‌లో గత వైకాపా ప్రభుత్వం మద్యం దుకాణం ఏర్పాటు చేసింది. నాలుగేళ్లుగా అక్కడ మద్యం విక్రయించారు. మరోవైపు హోటల్ నిర్వహణ లేక పరిసరాలన్నీ పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. తాజాగా కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీతో దుకాణాలు ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడంతో పర్యాటక హోటల్‌లోని మద్యం దుకాణం ఖాళీ చేస్తున్నారు. అయితే ఆ హోటల్ మామూలు స్థితికి రావాలంటే కొంత వ్యయం చేయాల్సిందే. ఇకనైనా పర్యాటకులకు అందుబాటులో ఉండేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అమరావతి

ఓటు నమోదుపై శ్రద్ధ చూపాలి



కార్యక్రమంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ప్రజాసంఘాల నేతలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఓటు నమోదు, వినియోగంలో పల్నాడు జిల్లా పట్టభద్రులు చైతన్యం చూపాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సూచించారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం పట్టభద్రుల ఓటు నమోదుపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. వచ్చే ఏడాది మార్చిలో జరగబోయే ఉమ్మడి గుంటూరు, కృష్ణా పట్టభద్రుల ఎన్నికలో పట్టభద్రులందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఓటు నమోదుకు ప్రజాసంఘాల ఐక్యవేదిక ప్రత్యేక శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఐక్యవేదిక నాయకులు చలమయ్య, విజయ్‌కుమార్, రవిబాబు, మహేష్, లక్ష్మీశ్వరరెడ్డి, మల్లేశ్వరి, రజని తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కేంద్రం ప్రారంభం

పిడుగురాళ్ల: పట్టణంలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓటు నమోదు సేవా కేంద్రాన్ని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయసారథి మంగళవారం ప్రారంభించారు. కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ నవంబరు 6వ తేదీతో ముగుస్తుందన్నారు. 2021 నాటికి డిగ్రీ పూర్తైన వారు అర్హులని తెలిపారు.

డిజిటల్ చెల్లింపులతో మేలు

పెదకూరపాడు: డిజిటల్ చెల్లింపుల ద్వారా మేలని వెలుగు ఏపీఎం బి.సునీత అన్నారు. మంగళవారం మండల సమాఖ్య కార్యాలయంలో స్త్రీనిధి ఇన్‌ఛార్జి చిన్న బొల్లయ్య ఆధ్వర్యంలో సీసీలు, స్త్రీనిధి మేనేజర్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీనిధి రికవరీ చెల్లింపుల్లో పారదర్శకత కోసం పేటీఎం యంత్రాలు ఇచ్చారు.

వరద బాధితులకు చేయూత

పెదకూరపాడు: వరద బాధితుల సహాయార్థం రూ.20 వేల చెక్కును పరుచూరి శ్రీనివాసరావు మంగళవారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు అందించారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

బెల్లంకొండ: శివాలయం వద్ద అయ్యప్ప స్వాములు, దీక్షాపరులకు అన్నదాన(సద్ది) కార్యక్రమం మంగళవారం ప్రారంభించినట్లు అయ్యప్ప సేవ కమిటీ సభ్యులు తెలిపారు.

రాష్ట్ర కుస్తీ పోటీల్లో ప్రతిభ

అచ్చంపేట: ఇటీవల విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో స్థానిక బ్లూబెల్స్ పాఠశాల విద్యార్థి మహదేవ్ గ్రీకో రోమన్ అండర్-17 విభాగంలో మూడో స్థానంలో నిలిచాడని ప్రిన్సిపల్ మేరిశ్రీలత తెలిపారు. కాంస్య పతకం అందజేశారు.

బాణసంచా స్వాధీనం

మాచవరం: అనుమతి లేకుండా బాణసంచా నిల్వ చేసిన గోదాంపై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. పోలీసుల కథనం ప్రకారం.. మాచవరానికి చెందిన రామకృష్ణ నిబంధనలకు విరుద్ధంగా గోదాంలో బాణసంచా నిల్వ చేయగా పోలీసులు సరకును స్వాధీనం చేసుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు.

ఇసుక తవ్వకాల ప్రారంభం వాయిదా

అచ్చంపేట, న్యూస్‌టుడే: మండలంలోని రీచ్‌ల్లో ఇసుక తవ్వకాల ప్రారంభం వాయిదా పడినట్లు తహసీల్దార్ జి.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. బుధవారం మండలంలోని నాలుగు రీచ్‌ల నుంచి తవ్వకాలు, ఇసుక సరఫరా ప్రారంభించాల్సి ఉందన్నారు. తవ్వకాలకు టెండర్లు తక్కువ ధరకు గుత్తేదారులు కోట్ చేయడంతో జాప్యమైందని సమాచారం.

తెదేపా నాయకులపై కేసు కొట్టివేత

సత్తెనపల్లి: 2019 సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా ముప్పాళ్ల మండల తెదేపా నాయకులపై నమోదైన కేసును కొట్టివేస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు. న్యాయవాది పూజల వెంకటకోటయ్య తెలిపిన వివరాల మేరకు.. ఎన్నికల సందర్భంగా రాజుపాలెం మండలం ఇనిమెట్లలో మాజీ సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావుపై దాడిని నిరసిస్తూ ఇరుకుపాలెం ప్రధాన రహదారిపై తెదేపా నేతలు ధర్నా చేశారు. దీనిపై ముప్పాళ్ల పోలీసులు తెదేపా మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావుతోపాటు మరో 15 మందిపై కేసు నమోదు చేశారు. వీరిపై అభియోగాలు రుజువు కాకపోవడంతో కేసును కొట్టివేస్తూ ఒకటో అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ప్రియదర్శిని తీర్పు ఇచ్చారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మాచవరం, న్యూస్‌టుడే: తురకపాలెం గ్రామానికి చెందిన తెదేపా సీనియర్ నేత షేక్ మాబు(85) ఇటీవల అనారోగ్యంతో చనిపోయారు. 'పల్లె పండగ' సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు రూ.25 వేల ఆర్థిక సాయాన్ని పిడుగురాళ్ల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో అందజేశారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

దాచేపల్లి: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చెప్పారు. మంగళవారం దాచేపల్లి మండలంలోని తక్కెళ్లపాడు, కేసానుపల్లి గ్రామాల్లో 'పల్లె పండుగ' కార్యక్రమం నిర్వహించారు. తక్కెళ్లపాడులో రూ.15 లక్షలు, కేసానుపల్లిలో రూ. 45లక్షల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైకాపా హయాంలో నాయకులు సర్వం దోచేశారని ఆరోపించారు. గతంలో గ్రామాల్లో సమస్యలపై నిరసన తెలపడానికి అవకాశం లేని పరిస్థితులు చూశామన్నారు. గురజాల నియోజకవర్గాన్ని ఐదేళ్లలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ఎంపీడీవో రామకృష్ణ, ఏపీవో మల్లికార్జునరావు, బద్రి, రామకోటయ్య, భాస్కర్‌రావు, మల్లి, పరంజ్యోతి, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాగి వాహనం నడిపిన వారికి జరిమానా

గురజాల: మద్యం తాగి వాహనం నడిపిన ముగ్గురికి జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి కె.వి.వి.సత్యనారాయణ మంగళవారం తీర్పునిచ్చారు. మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరికి రూ.10వేలు జరిమానా విధించగా, మరొకరికి 15 రోజులు జైలుశిక్ష విధించినట్లు సీఐ భాస్కర్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన తనిఖీలో పట్టుబడిన ముగ్గురిని కోర్టులో హాజరుపరచగా జడ్జి పైతీర్పు ఇచ్చారు.

మురుగు పారదు.. చెత్త తొలగదు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే



నాగార్జున నగర్‌లోకి వెళ్లే ప్రధాన రోడ్డులోని మురుగు కాలువ

నాగార్జునానగర్ వాసులను పలు సమస్యలు వెంటాడుతున్నాయి. మున్సిపాల్టీకి వివిధ పన్నుల రూపంలో ఆదాయాన్ని తెచ్చే ప్రాంతాల్లో ప్రధానమైన నాగార్జునానగర్‌పై పాలకులు, అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. ప్రధానంగా డ్రైనేజీ సమస్య వేధిస్తోంది. కాలనీలోని రహదారుల్లో కాలువలు సక్రమంగా లేవు. చిన్నపాటి వర్షం కురిసినా మురుగు నీరంతా రోడ్డుపైకి చేరుతోంది. అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి.

☛ నందిగామ డొంక రోడ్డులో కల్వర్టుల నిర్మాణం చేపట్టకపోవడం సమస్యగా ఉంది. మురుగు, వర్షపు నీరంతా రోడ్లపైనే ఉంటోంది. పగిలిన కల్వర్టులపై దృష్టి సారించట్లేదు. విద్యుత్తు స్తంభాలు, తీగల వ్యవస్థ కూడా సక్రమంగా లేదు. ఖాళీ స్థలాల్లో పిచ్చి చెట్లు, ముళ్లకంపలు కాలనీ వాసులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.

☛ నాగార్జునానగర్ వాసులు నడక, వ్యాయామానికి అమరావతి మేజర్ కాలువ వైపు వెళ్తుంటారు. పొలాలకు వెళ్లే రోడ్డు చిన్నపాటి వర్షం కురిసినా చిత్తడిగా మారుతోంది.

☛ గత ప్రభుత్వ హయాంలో అన్ని వార్డుల ప్రజలకు ఇంటి నివేశన స్థలాలు పంపిణీ చేసినా. నాగార్జునానగర్(10వ వార్డు) వాసులను విస్మరించారు.

☛ తాగునీటి పైపులైన్ల వ్యవస్థ సక్రమంగా లేదు. తరచూ లీకేజీలు చికాకు పెట్టిస్తున్నాయి.

☛ ఎంపీపీఎస్(హ్యారిస్) పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం, మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. పట్టణ ఆరోగ్య కేంద్రం సేవలు ప్రజలకు చేరువయ్యేలా వైద్యఆరోగ్యశాఖ శ్రద్ధ చూపించాలని ప్రజలు కోరుతున్నారు.



అగ్రి టెస్ట్ ల్యాబ్ వద్ద పిచ్చి మొక్కలు

పథకాలపై అవగాహన

మాచర్ల (కారంపూడి): విద్యుత్తు పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్‌ఈ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం విద్యుత్తు కార్యాలయంలో పలు అంశాలపై సమావేశం నిర్వహించారు. పీఎం సూర్యఘర్, ఆర్‌డీఎస్‌ఎస్, ఎల్‌డబ్ల్యూఈ, పీవీటీజీ పథకాలు, బకాయిల వసూలు, తదితర విషయాలపై చర్చించారు.

రేషన్ బియ్యం పట్టివేత

నకరికల్లు: అక్రమంగా తరలిస్తున్న 200 బస్తాల రేషన్ బియ్యాన్ని నకరికల్లు పోలీసులు పట్టుకున్నారు. చల్లగుండ్లలో బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు వాహనాన్ని పట్టుకున్నారు. పాపారావు, శ్రీను, వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేశారు.

18న మినీ జాబ్‌మేళా

మాచర్ల (కారంపూడి): ఈనెల 18న ఎస్కేబీఆర్ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీకుమారి తెలిపారు. ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులన్నారు.

రోడ్లు బాగు చేయండి



జమున ప్రభుత్వ పాఠశాల రోడ్డులో గోతులు

పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు, జమున ప్రభుత్వ పాఠశాల ప్రాంతం, బిలాల్ మసీదు ప్రాంతంలో తాగునీటి పైపులైను ఏర్పాటుకు సిమెంట్ రోడ్లను ధ్వంసం చేశారు. పైపులైను వేసిన తర్వాత మట్టితో పూడ్చారు. వర్షాలు పడటంతో ఆ ప్రాంతంలో కుంగి, నీరు నిలుస్తోంది. సిమెంట్‌రోడ్లు తవ్విన ప్రాంతంలో గుత్తేదారు మరమ్మతులు చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు. రైల్వేస్టేషన్ రోడ్డులో కుళాయిలకు తాగునీరు సక్రమంగా రావడం లేదు. ఎక్కువ సమయం నీరు వదలకపోవడంతో సమస్యగా మారింది. రైల్వేస్టేషన్ ప్రధానరోడ్డులో మురుగునీటి పారుదల కాల్వల్లో పూడిక పేరుకుపోయింది. కనీసం మూడు నాలుగు రోజులకోసారి పూడిక తీయాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. వాసవి అపార్టుమెంటు వెనుక బజారులో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. కొత్త వ్యక్తులు ఆప్రాంతానికి రావాలంటే భయపడుతున్నారు. జమున ప్రభుత్వ పాఠశాలరోడ్డు, ఎల్ఐసీ కృష్ణారావు బజారులో మురుగు కాల్వలు దెబ్బతిన్నాయి. సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. - పిడుగురాళ్ల, న్యూస్‌టుడే